ప్రతి గడపకు సంక్షేమం లక్ష్యం: మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - కశింకోట: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అమర్నాథ్ అన్నారు. మండలంలోని తేగాడ గ్రామంలో బుధవారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. తేగాడ గ్రామ సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, వైసీపీ గ్రామ ఇన్‌చార్జ్ దివాకర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమర్నాథ్ లబ్ధిదారులకు లబ్ధి పత్రాలను అందజేశారు. ఇంటింటి కొలాయి కొరకు మంచినీటి సరఫరా పథకం పైపులై న్ నిర్మాణానికి జలజీవన్ మిషన్ ద్వారా 28. 50 లక్షలతో నిర్మాణం అవుతున్న పైప్‌లైన్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఫిఫ్టీన్ ఫైనాన్స్ ద్వారా పదిహేను లక్షల రూపాయలతో మురికి కాలువల నిర్మాణం, 20 లక్షలతో దత్తాత్రేయ గుడి దగ్గర నుండి ఎస్సీ కాలనీ వరకు సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ తనయుడు వైసీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్ కుమారుడు శర్వానంద్ జన్మదినం సందర్భంగా దివాకర్ స్వగృహంలో మంత్రి అమర్నాథ్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగాల లక్ష్మి గున్నయ్య నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, మాజీ ఆర్ఈసీఎస్ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ తుంపాల వెంకట సత్యనారాయణ (రాజు), గోకువాడ సత్తిబాబు, గంటిపల్లి దేముడు, ఎంపీడీవో కొంకి అప్పారావు పాల్గొన్నారు.

మాడుగులలో పశు విజ్ఞాన బడి

విశాలాంధ్ర - మాడుగుల: పాడి రైతులందరూ ప్రభుత్వం కల్పించిన ఉచిత గర్భధారణ ఎద ఇంజక్షన్ల పథకాన్ని వినియోగించుకోవాలని మాడుగుల పశు వైద్య శాల సహాయ సంచాలకులు వి. చిట్టి నాయుడు తెలిపారు. గురువారం గంటిమూడి వారి కల్లాల వద్ద పాడి రైతులతో పశువిజ్ఞాన బడి నిర్వహించారు. ఎండాకాలంలో పశువుల సంరక్షణ, దూడపెయ్యలలో మరణాలు నివారణ, 75 శాతం సబ్సిడీపై కాకి జొన్న గడ్డి విత్తనాలపై అవగాహన కల్పించారు. పాడి పశువులు తీవ్ర అనారోగ్యానికి గురైనపుడు టోల్ ఫ్రీ నెంబర్ 1962కి ఫోన్ చేయాలని అన్నారు.

93వ వార్డులో ఆధార్ సేవలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: స్థానిక 93వ వార్డు ప్రహ్లాదపురం జీవీఎంసీ కళ్యాణ మండపంలో గురువారం ఆధార్ కార్డు అప్డేట్ కేంద్రం స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆధార్ కార్డు మార్పులు, చేర్పులు చేసుకునే వారు వారి ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడి, బ్యాంకు పాస్ పుస్తకం తదితర ధృవపత్రాలతో వచ్చి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గంగవరహాలు, కన్నె మాధవరావు, దాసరి బుజ్జి, టైలర్ శ్రీను, లైటింగ్ బుజ్జి వెంకటేష్, గాంధీ, పెద్ది, నాని, సురేష్, విజయ్, వాసు, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ ఆలయ అభివృద్ధికి పైలా విరాళం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలం గొండుపాలెం గ్రామంలో శ్రీ కృష్ణుడి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాడుగుల నియోజక వర్గం టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధికి రూ.10 వేల రూపాయలను యాదవ సంఘానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు దేముడుబాబు, బండారు ముత్య పాత్రుడు, కుంద్రపు అప్పారావు, గజ్జి దేముడుబాబు, సీమునిరి మునిలినాయుడు, కోట ముత్యాలు, ఒమ్మి దేముడుబాబు, కోట అప్పలనాయుడు, గజ్జి శ్రీను, బోర కన్నబాబు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి పండగ

విశాలాంధ్ర - పరవాడ: పరవాడలో బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ జడ్పీటీసీ పైలా జగన్నాథరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్టా సన్యాసప్పారావు, పైలా సన్యాసిరావు మాస్టర్, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు రామారావు, పైలా కృష్ణ, పైలా రామచంద్రరావు, పైలా అప్పలనాయుడు, పైలా పైడం నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బెదిరింపులను ఐక్యంగా ఎదుర్కొంటాం

విశాలాంధ్ర - మారేడుమిల్లి: బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చుతున్నామని ఆదివాసీల కోసం నిలబడతామని, ఆదివాసీలకు ద్రోహం తల పెడుతూ రెండు నాలుకల వాగ్దానాలను రాజకీయ పార్టీలు మానుకోవాలని గిరిజన సంఘం ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు అన్నారు. గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన ఆదివాసి పోరాట సంఘీభావ సభలో వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీలకు న్యాయం జరిగేలా తమ వైఖరిని తీర్మానం చేస్తూ రాష్ట్రపతికి పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీవీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కురసం పకీరు దొర, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు అట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఆవుల ధర్మారెడ్డి, జేఏసీ మండల నాయకులు కత్తుల రమణారెడ్డి, రేవుల జానకి రెడ్డి, సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు శంకుస్థాపన



విశాలాంధ్ర - అనంతగిరి: టోకూరు పంచాయతీ చిట్టం పాడు బొరిబొరివలస గ్రామాల్లో గురువారం బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లకు సర్పంచ్ కిల్లో మోస్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టవర్లు నిర్మాణంతో టోకూరు పంచాయతీలో కమ్యునికేషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇప్పటికే చిట్టంపాడు వాటర్ ఫాల్స్ అభివృద్ధి చెందుతుందని, చిట్టంపాడు గ్రామంలో టవర్ నిర్మాణం వలన వాటర్ ఫాల్స్‌కు వచ్చే పర్యాటకులలకు సెల్ సిగ్నల్ మరింత సులభంగా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న, టోకూరు ఎంపిటిసి సభ్యులు భర్త సార జగన్నాథం, వార్డు సభ్యులు రాముర్తి, చంద్రన్న, వాటర్ ఫాల్స్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మజ్జి అప్పన్న, కార్యదర్శి లక్ష్మణ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం



విశాలాంధ్ర - వి.ఆర్.పురం: వైశాఖ శుద్ధ పౌర్ణమి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవానికి, పాత రాజుపేట, రాజుపేట కాలనీ గ్రామాలలో వెలసిన శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారి కళ్యాణ మహోత్సవానికి దేవాలయాలు ముస్తాబయ్యాయి. దేవాలయాలను విద్యుత్ దీపాలంకరణలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని 10వ వార్డు కడిమి వారి వీధిలో మురికి కాలువ సమస్యను గుర్తించి దాని నూతన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా, గారా ప్రసాద్, జగతా శ్రీను, వార్డు సభ్యులు పిరాది రాజు, జగతా శ్రీను, లావేటి సన్యాసిరావు, ప్రభాకర్, హరీష్, ప్రసాద్, పండు, సురేష్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

తునిపాలెంలో పైపులైన్ ప్రారంభం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభ మండలం మద్ది పంచాయతీ తుని పాలెం గ్రామంలో సుమారు మూడు లక్షల రూపాయల నిధులతో నూతనంగా పైపులైన్‌ను స్థానిక ఎంపీపీ కె.రాంబాబు ప్రారంభించారు. గ్రామస్తులు మాట్లాడుతూ స్థానిక ఎంపీపీ కె.రాంబాబు, పంచాయతీ సర్పంచ్ తమ వినతి మేరకు అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసి నీటి ఎద్దడి నుంచి తమను ఆదుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్ భర్త బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

పుష్ప తరహాలో గంజాయి అక్రమ రవాణా

విశాలాంధ్ర - పెందుర్తి: పుష్ప తరహాలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా నుండి క్యాబేజీ బుట్టల మాటున బొలెరో వాహనంలో గంజాయిని తరలిస్తుండగా పెందుర్తి మండలం సరిపల్లి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులకు చిక్కారు. వాహనాన్ని తనిఖీ చేయగా 14 బస్తాల గంజాయి లభించింది. గంజాయితో పాటు బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - యలమంచిలి /రాంబిల్లి: టీడీపీ తోనే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుం దని పార్టీ మండలాధ్యక్షులు వి.దిన్ బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువతతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని యువత టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలానికి సంబంధించిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభించిన సుందరపు

విశాలాంధ్ర - రాంబిల్లి: మండలంలోని వాడ రాంబిల్లి గ్రామంలో గురువారం శ్రీ దుర్గమ్మ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా గ్రామ జనసేన పార్టీ నాయకులు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాంబిల్లి మండలాధ్యక్షులు పప్పల నూక్నన దొర, అచ్యుతాపురం మండలాధ్యక్షులు బయలపూడి శ్రీరామదాసు, జనసేన రాంబిల్లి మండల ప్రధాన కార్యదర్శి చోడిపల్లి ప్రసాద్, మండల ప్రచార కార్యదర్శి నాగరాజు, వాడ రాంబిల్లి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు నర్సింగరావు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న అవంతి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, దివంగత ధర్మకర్త ఆనంద్ గజపతి రాజు సతీమణి సుధా గజపతి తదితరులు దర్శిం చుకున్నారు. ఆలయ ఏఈఓ వై.శ్రీనివాసరావు పూలమాలలు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని, తమ గోత్ర నామాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. దర్శనానంతరం వేదపండితులు వేద ఆశీర్వచనం పలికారు. ఏఈఓ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కేజీబీవీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విశాలాంధ్ర - జీకేవీధి: ఇంటర్‌లో ఉత్తీర్ణత కాని కేజీబీవీ విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షల కొరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జీకేవీధి కేజీబీవీ స్పెషలాఫీసర్ ఎం.ఉష తెలిపారు. జీకేవీధి కేజీబీవీలో ఈ నెల 3వ తేదీ నుండి 23వ తేదీవ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మే 24 నుండి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. చింతపల్లి, కొయ్యూరు కేజీబీవీల విద్యార్థినిలకు కూడా జీకేవీధిలోని కేజీబీవీలోనే ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విలువల్లేని 'ప్రజాభిప్రాయ సేకరణలు'

- మామిడిపాలెం సాక్షిగా మరోసారి బట్టబయలు
- అసంపూర్తిగా సి.ఎల్.మోహన్‌రావు క్వారీ ప్రజాభిప్రాయ సేకరణ
- మరోమారు నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్

తమ గ్రామాల పరిధిలో ఉన్న క్వారీలకు అనుమతులు ఇవ్వాలా..? వద్దా..? అనే అభిప్రాయాలను గ్రామస్తుల వద్ద నుంచి వీడియో, ఆడియో రికార్డింగ్ రూపంలో బహిరంగంగా తీసుకొని మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు అధికారులు నిర్ణయం తీసుకుంటారు..కాని అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రజల అభిప్రాయాలకే విలువలేని ప్రజాభిప్రాయ సేకరణలు జరుగుతున్నాయని ఆయా క్వారీ సంబంధిత గ్రామాల గ్రామస్తులు బహిరంగంగానే, ప్రజాభిప్రాయ సేకరణ వేదికల వద్దే తమ గోడు వెల్లబుచ్చుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్న సంఘటనలు అనేకం..

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి సమక్షంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణలపై రోజురోజుకు ఆయా గ్రామాల ప్రజలకు పూర్తిగా నమ్మకం పోతుంది. మా గ్రామాల పరిధిలో క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దంటూ గొంతుచించుకొని మాట్లాడిన, గ్రామస్తులంతా ముక్తకంఠంతో వ్యతిరేకంగా మాట్లాడిన క్వారీలకు అనుమతులు మంజూరు కావడం వెనుక మతలబు ఏమిటో పాపం ఆయా గ్రామ ప్రజలకే తెలియడం లేదు. మా అభిప్రాయాలకే విలువలేనప్పుడు ఈ ప్రజాభిప్రాయ సేకరణలు ఎందుకంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తి ప్రజాభిప్రాయ సేకరణను మరోసారి నిర్వహించాలి

ఈ నెల 2న మామిడిపాలెంలో సి.ఎల్.మోహన్ రావు క్వారీకి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను మరోమారు నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్వారీకి ప్రజాభిప్రాయ సేకరణ మొదలైనప్పటి నుంచి గ్రామ సర్పంచ్‌తో పాటు మాట్లాడిన కొంతమంది గ్రామస్తులు తీవ్ర వ్యతిరేక వ్యక్తం చేశారు. ఇంకా అప్పటికి చాలా మంది గ్రామస్తులు మాట్లాడాల్సి ఉండగా వర్షం రావడంతో అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో గ్రామస్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అక్కడే ఉన్న క్వారీ యాజమాని మోహన్‌రావును చుట్టిముట్టి ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీకి గ్రామస్తులంతా వ్యతిరేకంగా ఉన్నారని ఎట్టి పరిస్థితుల్లో క్వారీకి అనుమతులు ఇవ్వొద్దంటూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. క్వారీ యాజమానితో వాగ్వివాదానికి దిగారు. వర్షం కారణం అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రజాభిప్రాయసేకరణను మళ్లీ మరోమారు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. క్వారీ యాజమాని ఒక హెక్టార్‌కు మాత్రమే ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించుకుంటున్నారని అక్రమంగా మరో రెండు హెక్టార్లలో క్వారీ నిర్వహణ చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అనుమతుల వెనుక మతలబేంటి...? - రెవెన్యూ రూటే సప "రేటు"

పారదర్శకంగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ అధికారులే వాటికి పాతరేసి అందినకాడకు దండుకో, దోచుకో, తినుకో(డిబిటి) పద్ధతిలో వ్యవహరిస్తూ.. ప్రజలు వ్యతిరేకించిన క్వారీలకు అనుమతులు మంజూరు చేయడం పట్ల క్వారీల సంబందింత గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర స్థాయిలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయసేకరణను నిర్వహిస్తున్న కాలుష్య నియంత్రణశాఖ పూర్తిగా అవినీతి కొరల్లో చిక్కుకుపోయిందని, వచ్చిన అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని తమ రూటే సప "రేటు" అనే పద్ధతిలో దండిగా రెవెన్యూ అధికారులు దండుకుంటున్నారని గ్రామస్తులే ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు వ్యతిరేకించిన అనుమతులు మంజూరు చేయడం వెనుక అధికారుల సొంత ప్రయోజనాలు తప్ప గ్రామస్తులు గోడు పట్టించుకోలేదని వాపోతున్నారు.ఇప్పటికైన అధికార్లు తమ తీరు మార్చుకొని ప్రజాభిప్రాయసేకరణలో గ్రామస్తుల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని క్వారీల సంబందింత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: బ్యాంకు సేవలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో సీతానగరం గ్రామంలో పాల కేంద్రం వద్ద గురువారం ఖాతాదారులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ అందిస్తున్న సేవలు, ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిట్లపై ఇతర జాతీయ బ్యాంక్‌ల కన్నా తమ బ్యాంక్ అధికవడ్డీని స్తుందని, మహిళా, వ్యవసాయ, గృహ, వాహన, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి, బంగారు ఆభరణాలపై గ్రాముకు 4150/- చొప్పున ఋణ సదుపాయం ఇసున్నట్లు చెప్పారు. పంట రుణాలను సకాలంలో చెల్లిం చిన ట్లైన ప్రభుత్వ రాయితీ పొందవచ్చని, పం ట రుణములు ఇంతవరకు తీసుకోని వారు 1బి ఫారం తీసుకు వచ్చి రుణం పొం దవచ్చని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అయిన జీవన జ్యోతి(వార్షిక ప్రీమియం రు.436/-) జీవన సురక్ష భీమా(వార్షిక ప్రీమియం రు20/-) పథకంలో ఖాతాదా రులు చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో ఫీల్డ్ ఆఫీసర్ మోట మర్రి శ్రీనివాసరావు, సర్పంచ్ సుంకరి చంటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్రం కుట్రకు బలైన తెలుగోడి హక్కు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వ కుట్రకు ఉక్కు పరిశ్రమ బలైపోయిందని ఉక్కు పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, వైటీ దాస్, వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, డి.శ్రీనివాస్, శ్రీనివాస్ నాయుడు, బీఎంల్ నాయుడు, జి.నరేంద్ర అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు 812వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో టిపిపి, ఆర్ఇడి, పిఇఎం, ఎస్.ఎం.డి స్టోర్స్ విభాగం కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో విభాగాన్ని కుంటు పరుస్తూ అమ్మకాలకు అవరోధాలు సృష్టిస్తుందన్నారు. ఉక్కు ఉత్పత్తులు కావలసిన రా మెటీరియల్ కొనుగోలు చేయకుండా ఉత్పత్తిని నిలిపివేస్తోందన్నారు. విశాఖ ఉక్కు నష్టాల బారిన పడుతుందని ఈ చర్యల పట్ల ఆందోళన చెందుతున్నామని అనడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వివాదాల కార్మికులు పాల్గొన్నారు.

జగన్ స్టిక్కర్లతో గిరిజనులకు ఏం లాభం

విశాలాంధ్ర - అరకులోయ: రాష్ట్రంలో జగనన్న మా భవిష్యత్, మా నమ్మకం పేరుతో ప్రతి గడపకు స్టిక్కరింగ్లు అతికించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్ పర్సన్, అరకులోయ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాచిపెంట శాంతకుమారి అన్నారు. మండలంలోని అరకులోయ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గడపగడపకు స్టిక్కరింగ్ అతికించడం వలన ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గిరిజన హక్కులు చట్టాలను తుంగలో తొక్కుతుందన్నారు. గిరిజనులకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో బెస్ట్ అవైలబుల్ స్కూలు పథకం ప్రవేశపెడితే బెస్ట్ స్కూల్ రద్దు చేసి గిరిజన విద్య కుంటుపడే విధంగా ప్రయత్నం చేసిందన్నారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వలంటీర్ల రద్దు గిరిజన విద్యార్థి మరణానికి శాపం అయిందని వ్యక్తం చేశారు. గిరిజనులకు గుండె కాయలాంటి జి.ఓ నెంబర్ 3 రద్దు అయి నేటికీ నాలుగు సంవత్సరాలైనా దీని గురించి వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు నోరు మెదవకపోవడం చాలా దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొర్ర పోతురాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిల్లో రామకృష్ణ, జంపరంగి వెంకటబాబు, తెడ బారికి భీమారావు, పి,చిన్నస్వామి, సాగర సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలి

నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో మహిళా భద్రత కోసం మహిళా పోలీస్ అధికారులు మరింత సమర్థవంతంగా పని చేయాలని నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ సూచించారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.యం.త్రివిక్రమ వర్మ ఆధ్వర్యంలో నగర మహిళా పోలీసులతో పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా పోలీసులు విధుల నిర్వర్తిస్తున్న తీరును సమీక్షించారు. అనంతరం వారు మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేలా సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ, ఎస్.బి ఏడీసీపీ, దిశా ఏ.సి.పితో పాటూ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు చెక్కులు అందజేత

విశాలాంధ్ర - మల్కాపురం: విశాఖ డెయిరి, సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గురువారం 62వ వార్డ్ దుర్గానగర్ గ్రామం కె.పరుశురాం అనారోగ్యంతో బాధపడుతుండడంతో పరామర్శించారు. అనంతరం వార్డు పరిధిలోని కార్పొరేటర్ బల్ల లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో టిడ్కో హౌసెస్ డి.డి అమౌంట్లను చెక్కుల ద్వారా 31 మంది లబ్ధిదారులకు రూ.8,41,000/- అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గల్లా శ్రీను, నమ్మి శ్రీను, భేసెట్టి గణేష్, సోషల్ మీడియా కన్వీనర్ స్పందన బాబురావు, సురాద అనుదీప్, నక్క సూర్యనారాయణ, భారతి, సత్యనారాయణ, పెద్దాడ ప్రసాద్, భూషణ్, మసానమ్మ, రఘు, అనంత లక్ష్మీ, పాము బాబురావు, సచివాలయ సిబ్బంది, సీఓ భాను, ఆర్పీలు పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాలలో ప్రత్యేక తరగతులు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని నేలతేరులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రత్యేక తరగ తులను ఏపీసీ శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. మూడు మండలాల్లో గల కేజీబీవీ నుండి ఇంటర్ సప్లమెంటరీకి హాజరవుతున్న విద్యార్థినీలు సగం మందే ప్రత్యేక తరగతులకు హాజరు కావడంతో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లను ప్రశ్నించారు. వేములవలస, ఎల్.వి పాలెం, పెద్దిపాలెం, కొమ్మాది తదితర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థినుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రత్యేక తరగతులకు పంపించాలని అన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ కలేసా బేగం, ఆనందపురం కేజీబీవీ ప్రిన్సిపాల్ చంద్రకళ పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తునికి పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండలంలోని సాగరం పంచాయతీలో తల సేమియా, రక్తహీనతలతో బాధపడుతున్న రెండు సంవత్సరాల బాలుడు దక్షిత్‌కు 10 వేల రూపాయలు పింఛనును ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు సహకారంతో మంజూరు చేసి అందిస్తున్నట్లు మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి ఈ పింఛను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొమ్మశెట్టి శ్రీనివాసరావు, పాము వెంకట్రావు, శ్రీనాథ్, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ శంకుస్థాపనా...?: గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరిట చేసిన శంకుస్థాపనలు ప్రజలను మభ్యపెట్టి, గందరగోళానికి గురిచేసే విధంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. గురువారం భీమిలి టీడీడీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గంటా నూకరాజు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా భోగాపురం విమానశ్రయానికి, అదాని డేటా సెంటర్‌కు శంకుస్థాపనలు చేసిన విషయం రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌పై గతంలో ఎన్నో కొర్రులు వేసిన మీరు నేడు శంకుస్థాపన ఎలా.? చేశారని ప్రశ్ని ంచారు. అధికారంలోకి వస్తే భోగాపురం ఎయిర్ పోర్ట్ కోసం ఇచ్చిన భూములు రైతులకు వెనక్కి ఇచ్చేస్తామని, భోగాపురం ఎయిర్ పోర్ట్ తయారయితే విశాఖ ఎయిర్ పోర్టులో ఈగలు తోలుకోవడమే అని చెప్పిన విషయం మర్చిపోయారా..? అని అన్నారు. చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తే ఎన్నికల హడావుడి కోసం తపన అని ఎద్దేవా చేసారని, మరి నాలుగేళ్ల కళ్లుమూసుకొని ఇప్పుడు చేసిన శంకుస్థాపన ఏ హడావుడి కోసమని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ అభివృద్ధి గాని, నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండగా విశాఖలో ఐటీ హబ్ ఏర్పాటుకు గాని నాడు చంద్రబాబు నాయుడు వేసిన బీజమని అన్నారు. రాష్ట్రానికి ఈ నాలుగేళ్ల వైకాపా పాలనలో ఒక్క ఐటీ కంపెనీ కూడా రాలేదు, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు కానీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో తలాతోక లేని ఈ హడావుడి శంకుస్థాపనలు ఎవరిని మభ్యపెట్టడానికని గంటా నూకరాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

జగన్మోహన్ రెడ్డి పాలనలో ఉపాధి కల్పన నిల్...గంజాయి ఫుల్

టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి

విశాలాంధ్ర - పాడేరు: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ఉపాధి కల్పన నిల్ గంజాయి ఫుల్ గా ఉందని టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం ఆమె తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తిగా వస్తున్నా యువతకు ఒక్క ఉపాధి అవకాశం కల్పించిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ప్రతీ ఏటా విడుదల చేసే వార్షిక నివేదిక ప్రకారం గంజాయి రవాణాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతుందని అన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 2021లో దేశ వ్యాప్తంగా సుమారు 7.5 లక్షల కిలోల గంజాయిని అధికారులు సీజ్ చేస్తే దానిలో రెండు లక్షలకు పైగా గంజాయి కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే పట్టుబడిందని, దేశంలో పట్టుబడిన మొత్తంతో పోల్చితే ఇది సుమారు 26 శాతానికిపైగా ఉందని అన్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2019లో 70,229 కేజీలు, 2020లో 97,826 కేజీలు, 2021లో 2,00,588 కేజీలను అధికారులు సీజ్ చేశారని తెలిపారు.

ఇచ్చిన హామీలు 90 శాతం నెరవేర్చామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ మెగా డీఎస్సీ స్పెషల్ డీఎస్సీ ఎక్కడ నెరవేర్చారో చూపించాలని ప్రశ్నించారు. రానున్న ఎన్నికలలో వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

పెందుర్తి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-పెందుర్తి : జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశము ప్రకారము ఈ నెల 8 నుండి ప్రతీరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు వేసవి శిక్షణ శిబిరము జరుపనున్నట్లు గ్రంథాలయ అధికారిని బి.సూర్య కళ తెలిపారు. ఈ కార్యక్రమాలు నిర్వహనకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, రిసోర్స్ పర్సన్స్‌తో గురువారం చర్చించారు. కథలు వినడం, పుస్తకాలు చదవడం, చదివిన పుస్తకంపై సమీక్ష, కథలు చెప్పడం స్పోకెన్ ఇంగ్లీష్ డ్రాయింగ్ పెయింటింగ్ పేపర్ క్రాఫ్ట్ డాన్స్ డ్రామా పాటలు పాడటం బొమ్మలు తయారుచేయడం వంటి కార్యక్రమాలు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో నేర్పుతామని తెలియచేసారు. కమిటీ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ పథకం శెట్టి భూలోకరావు సెక్రటరీ ఆడారి రామకృష్ణ రిసోర్స్ పర్సన్స్ డి ప్రభాకర్ సంగీతం టీచర్ కే భానుమతి క్లాసికల్ డాన్స్ టీచర్ శర్వాణి దేవి బి జగదీశ్వరరావు డాన్స్ టీచర్ శ్రీదేవి తదితరులు వేసవి శిక్షణ శిబిరంకు సహకరిస్తామని తెలియజేశారు .

బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయం

కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు గోదావరి జిల్లాల్లోనూ పలు శిక్షణా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రైట్ గుడ్ బాయ్స్ సంస్థ సేవలు అభినందనీయమని 82 వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి మందపాటి సునీత పేర్కొన్నారు. అనకాపల్లి 82 వ వార్డు గాంధీనగర్ ఇన్కమ్ టాక్స్ వీధిలో ఉన్న బ్రైట్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా నిరుద్యోగ యువత, మహిళలకు బ్రైట్ స్వచ్ఛత సంస్థ పలు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన బ్రైట్ స్వచ్ఛంద సంస్థ తన వార్డులో ఉండడం ఆనందదాయకమన్నారు. బ్రైట్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే అన్ని కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు మాట్లాడుతూ బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సహకారాన్ని అందజేయడానికి సహకరిస్తామన్నారు. వారి కోరిన విధంగా స్వంత భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించే అంశాన్ని స్థానిక శాసనసభ్యులు గౌరవ మంత్రివర్యులు శ్రీ గుడివాడ అమర్నాథ్ గారి దృష్టికి తీసుకువెళ్లి, ఆయన సహకారంతో సంస్థకు స్థలం కేటాయించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శంకర్ మాస్టారు కృషి అందరికీ ఆదర్శనీయమన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనకాపల్లి ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ లక్ష్మీపతి మాట్లాడుతూ. సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. అభివృద్ధికి అవసరమైన తమ వంతు సహకారాన్ని అందజేస్తామన్నారు. బ్రైట్ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్ల శివశంకర్, కార్యదర్శి తాటిపూడి జయశ్రీ, గాంధీనగరం అభివృద్ధి కమిటీ సభ్యులు కొండూరు రవీంద్రనాథ్, బిఎల్ఎన్ శర్మ, సంస్థ ప్రతినిధులు, శిక్షణకు హాజరైన అభ్యర్థులు పాల్గొన్నారు.

ఏపీని గంజాయి, మాదకద్రవ్యాల హబ్‌గా మార్చిన ఘనత జగన్‌దే

బుద్ధనాగ జగదీష్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : జగన్‌రెడ్డి అమాయకమైన ముఖం పెట్టి అబద్దాలు ప్రచారం చేయడంలో దిట్టని ప్రజలను నమ్మించడానికి మీ బిడ్డ దేవుని దయ సెంటిమెంటును మహిళలు మ న్నలు పొందడానికి, ఎన్నికల సమీపిస్తున్నందున శంకుస్థాపనలకు చేసిన వాటికి చేస్తూ తమ ఘనతగా చెప్పుకోవడం జగన్ రెడ్డికి చెల్లిందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విలేకుల సమావేశంలో వైసీపీ ప్రభుత్వం పై విరుచుకుపడ్డారు. చోడవరం నియోజవర్గ ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ. జగన్ రెడ్డి మాటలు రెండు నాలుక ధోరణి లో ఉంటాయని ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఒకలాగా అధికారం ఉన్నప్పుడు ఒకలాగా మాట్లాడటం ఇతని నైజం అని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భోగాపురం ఎయిర్ పోర్టు కు నాడు చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకుంటే అయ్యన్నపాత్రుడు, గంట శ్రీనివాసరావుకు, అవంతి కి లబ్ధి చేకూర్చడం కోసమే అక్కడ విమానాశ్రయానికి నిర్ణయం తీసుకున్నారని విమర్శించిన జగన్ రెడ్డి ఇప్పుడు అక్కడ వీళ్ళ భూములను ఎందుకు వదిలేసారని తాతయ్య బాబు ప్రశ్నించారు. మాడుగుల ఇన్చార్జ్ పీ.వీ జి కుమార్ మాట్లాడుతూ. ఒకప్పుడు దేశం మొత్తానికి ఆహారాన్ని అందించిన అన్నపూర్ణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు హబ్ గా మార్చేసారని, ప్రతిరోజు కొన్ని లక్షల టన్నుల గంజాయి ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల దాటుతుంటే వాటిని తరలించే వారిపై మాత్రం కేవలం 1775 కేసులు మాత్రమే పెట్టారని, దీన్ని బట్టి చూస్తే వైసీపీ నాయకుల గంజాయి మాఫియా కు ఏ విధంగా సహకరిస్తున్నారో అర్థమవుతుందని కుమార్ మండిపడ్డారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కి పెట్టుబడులు రాక సైకో ముఖ్యమంత్రి పాలనలో పెరిగిన నిరుద్యోగం సమస్య పెరిగిపోయిందని, యువతే దేశానికి భవిష్యత్తు అయితే జగన్ రెడ్డి వారికి సరిగా ఉద్యోగం అవకాశాలు కల్పించడం లేదని, గతంలో 35 శాతం ఉన్న నిరుద్యోగ సంఖ్య ప్రస్తుతం 73 శాతానికి పెరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయని కాశీనాయుడు అన్నారు. జగన్ రెడ్డి ప్రతి సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు ధరల పెరుగుదల, నిరుద్యోగం, నాలుగు సంవత్సరాలయిన రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు రాక పోగా, ఉన్న కంపెనీలు ఎందుకు రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాయో దాని గురించి మాట్లాడితే బాగుంటుంది కానీ, కానీ ఈ సైకో ముఖ్యమంత్రి తన వైఫల్యాలను దాచుకోవడానికి నంగనాచి మాటలు, మీ బిడ్డ, దేవుని దయ నంగి ఏడ్పులు ఏడుస్తాడని సభలో చంద్రబాబు నాయుడు ను తిట్టడం దుర్భాషలాడడం ఈ రెండింటితో సరిపడతాడని తన అవినీతి అక్రమాలను బయటపడకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తారని నాగ జగదీష్ మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 48 లక్షల మంది పట్టభద్రులు ఉన్నారని వారిలో కనీసం డబ్బే శాతానికి పైగా ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని, ఉద్యోగ ఉపాధి కల్పన పెట్టుబడులను ఆకర్షించడంలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అప్పులు రాష్ట్రంగా మార్చారని, ఏ రాష్ట్రములో ఇటువంటి పరిస్థితి లేదని సైకో ముఖ్యమంత్రి పాలన వల్ల రాష్ట్రంలో అప్పులు పెరగడం ఆర్థికంగా దివాలా తీయడం ఇప్పుడు రాష్ట్రం అప్పు పది లక్షల కోట్లు పైబడి ఉందని దానిలో జగన్ రెడ్డి చేసిన అప్పు ఎనిమిది లక్షల కోట్లు పైబడి ఉందని, దీనలో సంక్షేమానికి ఇచ్చింది 2.15 లక్షల కోట్లు మాత్రమేనని మిగిలిన డబ్బుకు లెక్కలు లేవని కేంద్రం అడిగినప్పటికీ సరియైన వివరణ ఇవ్వకుండా దాటవేస్తున్నారని జగన్ రెడ్డి ప్రభుత్వం లో మంత్రులు ఎమ్మెల్యేలు వైసిపి నాయకులు అందరూ కలసి దోచుకోవడం దాచుకోవడం లక్ష్యంగా చేసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో ఇంటికి పోతామని ఉద్దేశంతోనే ఇల్లు చక్కబెట్టు కుంటున్నారని నాగ జగదీష్ ఘాటుగా విమర్శలు చేశారు. విలేకరుల సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గునూరు మల్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థులు ఎన్.ఎస్.ఎన్. అధ్వర్యాన స్పెషల్ క్యాంప్

విశాలాంధ్ర-కూర్మన్న పాలెం : సమాజ సేవలో మేము సైతం అంటూ ఎన్. ఎస్. ఎస్ స్పెషల్ క్యాంప్ ను ఏడు రోజుల సేవలో భాగంగా ఎమ్. బి.ఎ మొదటి సంవత్సరము చదువుతున్నటువంటి 20 మంది విద్యార్థులు నిర్విరామంగా వారం రోజుల పాటు వివిధ సేవ కార్యక్రమంలో పాల్గొని, ప్రజలకు ముఖ్యమైన అంశాలపైన అవగాహన కల్పించారు. ఎన్. ఎస్. ఎస్ స్పెషల్-క్యాంప్ లో భాగంగా వారం రోజుల పాటు, ఏప్రిల్ 24 నుంచి ఏప్రిల్ 30 వరకు అర్లాడ గ్రామము, పాడేరు మండలము నందు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ సేవ చేశారు. ఇందులో భాగంగా స్వచ్ భారత్,, సోకిన వ్యాధులపై అవగాహన కార్యక్రమంలు, బాల కార్మికులు %ఌ% బాల్య వివాహాలపై అవగాహన, ఆధునిక వ్యవ సాయ వ్యవస్థ, ఉన్నత విద్య %ఌ% అవకాశాలు, డిజిటల్ అక్షరాస్యత %ఌ% డ్రగ్ ఫ్రీ సొసైటీ ప్లాస్టిక్ నిషేధం %ఌ% విలువల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్పెషల్-క్యాంప్ తో పాటు మంత్రిత్వశాఖ మరియు రీజినల్ కోఆర్డినేటర్ అఫ్ ఎన్. ఎస్. ఎస్. హైదరాబాద్ వారి సూచనల మేరకు ఒక సర్వేను జరిపించి, 17-22 మధ్య వయస్సున యువతి, యువకుల వివరాలను (వారి చదువు, ఉద్యోగ, ఇతర అంశాలను తెలుసుకోని సమాచారన్ని అందచేశారు. ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ శ్రమకు ఫలితంగా తమ గ్రామలలోని చాల మంది ప్రజలకు అవగాహన చాలా అంశాలపై వచ్చిందన ప్రతి వాలంటీర్ కు సొలుగు పంచాయతీ సెక్రటరీ శ్రీ కె. బాలకృష్ణ అభినందించారు.కళాశాల రెక్టర్ డా.వి.మధుసుధనరావు, ప్రిన్సిపాల్ డా.జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డా.పి.వి.రవీంద్ర, ఎన్. ఎస్.ఎస్ ప్రోగ్రామర్ ఆఫీసర్ డా.ఆర్.సుందరా రామమ్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ శ్రీ చైతన్య, డీన్స్, అద్యాపకులు విద్యార్థులను అభినందించారు.

నేడు మర్రి కామయ్య వర్ధంతి



విశాలాంధ్ర-హుకుంపేట : స్వాతంత్ర్య పోరటంలో పోరడిన విప్లవకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ మర్రి కామయ్య వర్ధంతి వేడుక శు క్రవారం ఘనంగా నిర్వహిస్తు న్నట్లు మర్రి కామయ్య ఆశయసా ధన సమితి సభ్యులు పాంగి సత్య రావు,కొర్ర కృష్ణామూ ర్తి,శంకరరావు, నాగేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం స్థానిక విలేఖరులతో మాట్లాడుతు మండలంలోని కామయ్యపేట గ్రామంలో మర్రి కామయ్య సమాధి వద్ద నిర్వహించే ఈ వర్ధంతి వేడుక లకు మండల వాసులు,అధికారు లు,నాయకులు హాజరై విజయవం తం చేయాలని వారు కోరారు.

లక్ష్మీపురంలో మహిళ అదృశ్యం

విశాలాంధ్ర-పెందుర్తి : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఒప్పంగి వెంకటలక్ష్మి (35) ఈనెల 2 నుండి కనిపించడం లేదని ఆమె భర్త సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు ఇంట్లో నుండి బయటకు వెళ్లిన వెంకటలక్ష్మి తిరిగి రాలేదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ గొలగాని అప్పారావు కేసు నమోదు చేసి హెడ్ కానిస్టేబుల్ ఎం. ప్రకాష్ బాబుకు దర్యాప్తు బాధ్యతలను అప్పగించారు. ఆచూకీ తెలిసినవారు పెందుర్తి పోలీసులను సంప్రదించాలని ప్రకాష్ కోరారు

డీఆర్‌హెచ్‌పీ దరఖాస్తు చేసిన ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు

విశాలాంధ్ర-విశాఖ సిటీ : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని పరిమిత బ్యాంకు సేవలు లభించే వినియోగదారులను లక్ష్యంగా చేసుకున్న డిజిటల్ ఫస్ట్ ఎస్ఎఫ్‌బీ ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ తమ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ని మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) వద్ద సమర్పించింది. ఈ బ్యాంక్ తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా 10 రూపాయల ముఖ విలువ కలిగిన 625 కోట్ల రూపాయల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయడంతో పాటుగా ఇన్వెస్టర్ సెల్లింగ్ షేర్ హోల్డర్లకు చెందిన 17,000,000 ఈక్విటీ షేర్లను విక్రయానికి అందుబాటులో ఉంచనుంది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన మొత్తాలను బ్యాంక్ యొక్క భావి మూలధన అవసరాల కోసం వినియోగించనున్నారు.

ఒకేసారి 100 టీవీఎస్ ఐక్యూబ్ వాహనాలు అందజేత

విశాలాంధ్ర-విశాఖ సిటీ : ప్రముఖ వాహనాల తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ తన మెగా డెలివరీ చాటుతూ 10 రోజులలో 10 నగరాలు 1,000 వాహన డెలివరీలు మారథాన్‌ను వైజాగ్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా నగరంలో 100 టీవీఎస్ ఐక్యూబ్ బైక్లను డెలివరీ చేశారు. టీవీఎస్ ఐక్యూబ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎఐఎస్156 పేస్ 2కి విజయవంతంగా మారాయని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈవి ప్రయాణం దిశగా, టీవీఎస్ మోటార్ కంపెనీ మూడు ప్రాథమిక సూత్రాల ద్వారా ప్రేరణ పొందిందన్నారు. వినియోగదారులకు శ్రేణి, కనెక్ట్ చేయబడిన సామర్థ్యాలు, ఛార్జర్‌లు, రంగుల కోసం ఎంపిక శక్తి (పవర్ అఫ్ ఛాయస్)ని అందిస్తుందన్నారు. తాజా నిబంధనలకు కట్టుబడి ఉంటూనే డెలివరీ వాగ్దానానికి దారితీసే మొత్తం కొనుగోలు అనుభవం అందిస్తూ ఉండటంద్వారా వాహన భద్రతకు సంబంధించి టీవీఎస్ ఐక్యూబ్‌ని నిర్వహించడంలో సరళత(సింప్లిసిటీ ఆఫ్ ఆపరేటింగ్) వున్నాయన్నారు. ప్రస్తుతం ఈస్కూటర్ భారతదేశంలోని 140 నగరాల్లో అందుబాటులో ఉందని చెప్పారు.

కేజీబీవీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విశాలాంధ్ర-జీకేవీధి : ఇంటర్‌లో ఉత్తీర్ణత కానీ కేజిబివి విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షల కొరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జీకేవీధి కేజీబీవీ స్పెషలాఫీసర్ ఎం.ఉష తెలిపారు. జీకేవీధి కేజీబీవీలో ఈ నెల 3వ తేదీ నుండి 23వ తేదీవ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మే 24 నుండి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. చింతపల్లి, కొయ్యూరు కేజీబీవీల విద్యార్థినిలకు కూడా జీకేవీధిలోని కేజీబీవీలోనే ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కానీ విద్యార్థినిలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలన

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మేజర్ పంచాయితీలో జరుపుతున్న డ్రైనేజీ (మురికి కాలువల) నిర్మాణ పనులను సి.పి.ఐ. మండల కార్యదర్శి నేమాల హరి, 10వ వార్డు నెంబర్ ధనలక్ష్మి గురువారం పరిశీలించారు. బానయ్య కోనేరు, పూర్ణా దియేటర్ ప్రక్కన నూతనంగా జరుగుతున్న మురికి కాలువలు నిర్మాణ పనులను వారు పరివేక్షించారు. కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను కోరారు. పంచాయితీ లో డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి అయితే అపారిశుధ్యం ఆంతరించి ప్రజారోగ్యం కుదుట పడే అవకాశం ఉందని వార్డు నెంబర్ నేమాల ధనలక్ష్మి అన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-ఆనందపురం : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-3 పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, 5/5/2023 నాడు కొత్త ఎలక్ట్రికల్ విద్యుత్ లైన్లు పనులు బుధవారం నిర్వహించబడుతుందని అందువల్ల అనందపురం మండలంలో తర్లు వాడ, నగరపాలెం, గంటపేట, ప్రకృతి వానిపాలెం, గుడిలోవ, దుక్కవానిపాలెం,పాలవలస, వేములవలస, పెద్దిపాలెం , లోడగలవానిపాలెం, బాకురుపాలెం, గిడిజాల, ముచ్చర్ల, మిండి వాని పాలెం, గుమ్మడివాని పాలెం, వేమగొట్టిపాలెం తంగుడుబిల్లి, ఈపంచాయతీ లకు,అన్ని గృహ వాణిజ్య పారిశ్రామిక వినియోగదారులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2గంట వరకు విద్యుత్‌అంతరాయం కలుగుతుందని, ప్రజలందరూ సహకరించవలసిందిగా ఆనందపురం ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

పని ఒత్తిడి వలనే వీఆర్వో మృతి

పాడేరు డివిజన్ అధ్యక్షుడు కే కోటి బాబు

విశాలాంధ్ర-అనంతగిరి : కోట విఆర్వో విష్ణుమూర్తి పని ఒత్తిడి వల్లనే మృతి చెందాడని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పాడేరు డివిజన్ నాయకులు కే కోటి బాబు రామ జోగారావులు ఆరోపించారు వై రామవరం మండలం కోట వీఆర్వో పనిచేస్తున్న విష్ణుమూర్తి సోమవారం అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే తదితర పనులపై ఉన్నతాధికారులు ఒత్తిడితోనే గుండుపోటుకు గురయ్యారని గ్రామ రెవెన్యూ అధికారులకు పని ఒత్తిడి తగ్గించి మరణాలు పునరుత్వం కాకుండా చూడాలని ఆయన తెలిపారు ఈ సందర్భంగా విష్ణుమూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-జీకేవీధి : గిరిజనుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జీకేవీధి మండలం గ్రామ సచివాలయం-1 పరిధిలో రామాలయంవీధి, కొత్తపాకలు గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించే ప్రయత్నం చేశారు. ప్రతిగడపలోనూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామస్థులు సాదర స్వాగతం పలికారు. స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే గారికి వివరించారు. కొన్నిచోట్ల సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేయాలని విన్నవించారు. మరొకచోట వంతెన నిర్మాణం అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన అన్నదమ్ములు అక్కాచెల్లెమ్మలుగా భావించే జగన్‌మోహన్‌రెడ్డి ఆదివాసీయులకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా శాసనసభ్యుల స్వయంగా వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకునే పరిస్థితి ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లోనే ఉందన్నారు. ప్రతి సమస్యను శాసనసభ్యుల స్వయంగా వెళ్లి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిజంగానే ఒక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తుందని ప్రజల సర్వతోముఖాభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్నటువంటి అభివృద్ధి పథకాలను కూడా ఇతర రాష్ట్రాల అధ్యయనం చేస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 108 గడపలను సందర్శించారు. ఈ లికార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, మండల ప్రెసిడెంట్ బి లక్ష్మణ్, సర్పంచ్ కొర్ర సుభద్ర, వైస్ ఎంపిపిలు ఆనంద్, దేవుడు, ఎంపిటిసి రాజులమ్మ, డైరెక్టర్ సత్యవతి, ప్రసాద్, వి.అరుణ్ వెంకట్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మందు బాబుల ఆగడాలతో ప్రజలు, అన్నదాతల అవస్థలు

విశాలాంధ్ర-చోడవరం : మద్యం తాగే మందుబాబులకు గుడి, బడి, రోడ్డు, పచ్చని పంట పొలాలు తేడా లేకుండా ప్రవర్తిస్తుండటంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటి పడిందంటే చాలు వయస్సు తారతమ్యం లేకుండా ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ ఆయా పరిసరాలను చిన్నాభిన్నం చేస్తున్నారు. ఖాళీ సీసాలు చితగ్గొట్టి రోడ్ల పైన, పొలాల్లో పడేస్తూ భీభత్సం సృష్టిస్తున్నారు. మందుబాబులు వదిలి వెళ్ళిన ఖాళీ సీసాలు, వాటర్ పెకెట్లు, పగిలిన గాజు పెంకులు తో అన్నదాతలు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని వివిధ ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇది వరకు మద్యం దుకాణాల వరకే పరిమితం అయ్యే ఈ దురవస్థ ఇప్పుడు గుడి, బడి తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఎదురవుతూ వుండటంతో ప్రజలు, మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. వీరిని నియంత్రించేందుకు పోలీస్ వ్యవస్థ మరింత పటిష్ఠంగా పని చేసి ప్రజారోగ్యానికి భంగం కలిగించే దుష్ట శక్తులను నియంత్రించాల్సినదిగా వివిధ మహిళా, ప్రజా సంఘాల వారు కోరుతున్నారు.

అద్దె వాహనాలను సద్వినియోగం చేసుకోండి : రైల్వే డీఆర్ఎం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ రైల్వే స్టేషన్‌కి వచ్చే ప్రయాణీకులు, పర్యాటకులు, ప్రజలు అద్దె వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే డివిజనల్ మేనేజర్ అనూప్ కుమార్ శతపతి కోరారు. రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ఆవరణలో రాధా కృష్ణ ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు చేసిన బైక్, కార్ రెంటల్స్ ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్లు, బైకులు రోజు వారీ అద్దె ప్రాతిపదికన అందించడం అభినందనీయం అన్నారు. సంస్థ అధినేత నాయుడు మాట్లాడుతూ, రోజుకి బైక్ అయితే రూ.500, కారు అయితే రూ.2,500 వంతున అద్దె ఛార్జ్ చేస్తున్నాము అన్నారు. విశాఖలో రోజురోజుకు పర్యాటకం అభివృద్ధి చెందుతున్న తరుణంలో అద్దె వాహనాలకు డిమాండ్ పెరిగింది అన్నారు. వినియోగదారులు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాల్సి వుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

రాయితీ పై వ్యవసాయ యంత్రాలు పంపిణీ

సచివాలయ కన్వీనర్ బొజ్జన్న దొర

విశాలాంధ్ర-చింతపల్లి : వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులను ప్రోత్సహించేందుకు వైకాపా ప్రభుత్వం రాయితీ పై వ్యవసాయ యంత్రాలను అందిస్తుందని బెన్నవరం సచివాలయ కన్వీనర్ బచ్చలి బొజ్జన్న దొర అన్నారు. గురువారం మండలంలోని బెన్నవరం పంచాయతీ కేంద్రంలో రైతులకు రాయితీ ద్వారా మంజూరైన పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యమిస్తుందని అన్నారు. రైతులకు రాయితీ ద్వారా మేలైన విత్తనాలు, ఎరువులు అందిస్తూనే, వ్యవసాయ పెట్టుబడి కోసం వారికి రైతు భరోసా అందిస్తుందన్నారు. వ్యవసాయ అభివృద్ధిలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులకు రాయితీ పై వ్యవసాయ యంత్రాలను వైకాపా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి మేరి, గృహ సారధులు కొర్ర అప్పారావు, పాంగి సత్తిబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజశేఖర్, వాలంటీర్లు సుధీర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

అర్హతగల ప్రతి మహిళకు అవసరం మేరకు అప్పు

- స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మూర్తి

విశాలాంధ్ర-ఆమదాలవలస: పొదుపు సంఘం లో సభ్యురాలుగా ఉన్న ప్రతి మహిళకు అవసరం మేరకు అప్పులు మంజూరు చేస్తామని, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ డి.ఏ.ఎన్. మూర్తి తెలిపారు. గురువారం మండల మహిళా సమాఖ్యలో అధ్యక్షురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో జరుగు తున్న శిక్షణా సమావేశంలో పాల్గొని మాట్లా డారు. సంఘంలో నెలవారి దాచుకు న్న పొదుపు మొత్తల నుంచి సంఘం తీర్మానం ప్రకారం అవసరమైన ప్రతి సభ్యురాలుకు పొదుపు అప్పులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. పొదుపు నుంచి అప్పులు వాడుకొని తిరిగి చెల్లిస్తున్న అలవాటు ఉన్న సంఘాలన్నింటికీ అవసరమైన లోన్స్ ఇస్తా మన్నారు. సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న సభ్యుల వ్యక్తిగత, వ్యాపార పెట్టుబడి అవసరాలకు కావలసిన అంత రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సంఘాల గ్రేడింగ్ కోసం సమాచా రాన్నంతటినీ లోకోస్ యాప్ లో నమోదు చేయుటకు అవసరమైన శిక్షణను ఏరియా కోఆర్డినేటర్ పి. రవికుమార్, ఏ.పి.ఎం. పైడి కూర్మారావు వి.వో.ఎ. లు అందరకు వివ రించారు . ఈ శిక్షణా కార్యక్రమంలో కోశా ధికారి రేణుక, క్లస్టర్ కోఆర్డి నేటర్లు మండల స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పొదుపు సంఘం లో సభ్యురాలుగా ఉన్న ప్రతి మహిళకు అవసరం మేరకు అప్పులు మంజూరు చేస్తామని, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ డి.ఏ.ఎన్. మూర్తి తెలిపారు. గురువారం మండల మహిళా సమాఖ్యలో అధ్యక్షురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఘంలో నెలవారి దాచు కున్న పొదుపు మొత్తల నుంచి సంఘం తీర్మానం ప్రకారం అవసరమైన ప్రతి సభ్యు రాలుకు పొదుపు అప్పులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. పొదుపు నుంచి అప్పులు వాడుకొని తిరిగి చెల్లిస్తున్న అలవాటు ఉన్న సంఘాలన్నింటికీ అవస రమైన లోన్స్ ఇస్తామన్నారు. సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న సభ్యుల వ్యక్తిగత, వ్యాపార పెట్టుబడి అవసరాలకు కావలసిన అంత రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వారు సంఘాల గ్రేడింగ్ కోసం సమాచారాన్నంతటినీ లోకోస్ యాప్ లో నమోదు చేయుటకు అవసరమైన శిక్షణను ఏరియా కోఆర్డినేటర్ పి. రవికుమార్, ఏ.పి.ఎం. పైడి కూర్మారావు వి.వో.ఎ. లు అందరకు వివరించారు . ఈ శిక్షణా కార్యక్రమంలో కోశాధికారి రేణుక, క్లస్టర్

అంతర్జాలంపై శిక్షణ



విశాలాంధ్ర-పోలాకి: డ్వాక్రా సంఘాల బలోపేతం కోసం అంతర్జాలం పై శిక్షణ జరిగింది.గురువారం మండలసమాఖ్య కార్యాలయం లో లోకోస్ యాప్ గూర్చి (ప్రజలే అపరేటింగ్ చేసుకొనే పద్దతి)గూర్చి 4రోజులు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంఆర్ఎల్ఎం ద్వారా నిర్వహించిన పాత్ర మొబైల్ అప్లికేషన్ లో సంఘం యొక్క పూర్తి ఆర్థిక అంశాలు, సభ్యుల సమాచారం,అంతర్జాలం లో ఉంచటం గురించి వీఓఏ లుకు,సీసీలుకు,4 రోజులు శిక్షణా కార్యక్రమం జరిగింది. అలాగే సామజిక సమీకరణ అర్హత ఉన్నా ప్రతి కుటుంబాలు సంఘాల్లో చేర్పించడం ఎం జి ఎన్ ఆర్ ఎస్ జాబ్ కార్డు ఇప్పించడం ఆగిపోయిన సంఘాలని పునరుద్దించటము అలాగే సంగాలన్నీ ఏ గ్రేడ్ లో ఉండేటట్లు చూసుకోవాలి. వై పనులన్నీ కూడా ఏప్రిల్18 తేదీ నుండి జూన్ 30వ తారీకు వరకు ప్రతి గ్రామ సంఘాల్లోసిబ్బంది పనిచేయాలి. ఈ కార్యక్రమానికి ఏసీ కొండలరావు ఏపిఎం మండలసమాఖ్య అధ్యక్షులు సీసీలు, వీఓఏలు ఫాల్గు పలువురు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు: ఏఈఓ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం పేరుతో విక్రయిస్తున్న అగర్‌బత్తికి దేవాదాయ శాఖ పేటెంట్ హక్కులు ఉన్నాయా అని కొంతమంది భక్తులు అడుగుతున్నారు. దీనికి కారణం శాశ్వత ఈఓ లేకపోవటంతో సిబ్బంది, అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని గడచిన ఫిబ్రవరిలో రాష్ట్ర దేవాదాయ శాఖ ఓ ఉన్నతాధికారి ఇటీవల చడా మడా అక్షింతలు వేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే ఓ గుత్తేదారునికి దేవస్థానం 5 x 5 విస్తీర్ణం కలిగన స్థలంలో, అది కూడా లీజెస్ విభాగం వారు చెప్పిన ప్రాంతంలో మాత్రమే స్వామి వారికి వాడిన తులసి, పూలు నుండి అగర్ బత్తి తయారి, విక్రయం చేసుకునేందుకు సంవత్స కాలానికి రూ.5 లక్షలు దేవస్థానంకు చెల్లించేందుకు ఆదేశాలు ఉండగా అందుకు వ్యతిరేకంగా దేవస్థానంకు చెందిన కొంతమంది అధికారులు, సిబ్బంది అండతో సుమారుగా 18x30 విస్తీర్ణంలో ప్రసాదాల కౌంటర్ పైన ఓ షెడ్, విక్రయ కేంద్రం 5x5 గుత్తేదారు నిర్మించారు. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ ఉన్నతాధికారి మొన్న దర్శనంకు వచ్చినప్పుడు ఆలయానికి చెందిన ఏఈఓ, సూపరింటెండెంట్‌లను ఏమండి ఏంటిది? ఎవరిని అడిగి ప్రసాదాల కౌంటర్ పైన అంత షెడ్ వేశారని ప్రశ్నించారని ? అందుకు సదరు ఆలయ అధికారులు మాకు తెలియదు సర్ అని సమాధామిచ్చారని సమాచారం. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల్లో నెలకు సుమారుగా రూ.1.20 నుండి 2 లక్షల రూపాయల వరకు గుత్తేదారులు అగర్‌బత్తి తయారు చేసుకునేందుకు పైకం చెల్లిస్తున్నట్లు, ధరలు పట్టిక పెట్టకుండా అగర్ బత్తి ప్యాకెట్లపై దేవస్థానం వారు తయారు చేస్తున్నట్లు దేవస్థానం అని ముద్రించరాదనే నిబంధనలు కూడా ఉన్నాయని సమాచారం. అయితే ఈ విషయంపై ఆలయ ఏఈఓను వివరణ కోరగా అందుకు ఆయన నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని, లీజెస్ విభాగం అధికారుల నుండి వివరాలు తీసుకుని సదరు గుత్తేదారునిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఇటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓ మార్గంలో పెట్టేందుకు త్వరలో శాశ్వత ఈఓను నియమించనున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండల పరిషత్ కార్యాల యాన్ని గురువారం జెడ్పి సి.ఈ.ఓ. పి.భాస్కరరావు ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రభుత్వ నిధులు వినియోగం, వివిధ అభివృద్ధి పనులపై ఎం.పి.డి.ఓ. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. మండల స్థాయి అధికారుల హాజరుపై ఆరా తీశారు. విధులకు దుమ్మా కొట్టే అధికారులకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. ఎం.పి.పి., జెడ్.పి. నిధులతో అమలవుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలని అన్నారు. ఆయన వెంట చోడవరం ఇన్‌ఛార్జి ఎంపీడీఓ చైతన్య, ఎంపీపీ గాడి కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కోటవురట్ల: ప్రభుత్వం శాఖల వారిగా ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేలా అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడానికి సిబ్బంది లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఎక్కువమంది ఉపాధి పనుల్లో హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రేమ సాగర్, గృహ నిర్మాణ శాఖ అధికారి జగదీశ్వరరావు, ఉపాధి ఏపీవో గంగు నాయుడు, కోటవురట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాములవారి ధ్వజ స్తంభం ఊరేగింపు

విశాలాంధ్ర - పెద గంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీలో శ్రీ రాముల వారి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్టం చడానికి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా గురువారం పెదగంట్యాడ జంక్షన్ నుండి రామాలయం వరకు మేళతాళాలతో ధ్వజస్తంభంను తీసుకొచ్చారు. సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో ప్రతిష్టంచబడుతున్న ఈ ధ్వజ స్తంభ కార్యక్రమానికి దాతలు నిలాపు తిరుమల రెడ్డి దంపతులు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పల దేవన్ రెడ్డి, వంశిరెడ్డి, గొందేసి మహేశ్వర రెడ్డి, అప్పలరెడ్డి, సత్యారావు, యేల్లేటి శ్రీనివాసరావు, నిలాపు అప్పన్న, పరదేసి, పులి రాము, డి.సోమనాథ రెడ్డి, ముద్దుర్తి శ్రీరామమూర్తి, నామాల పెంటయ్య, పిట్టా రమణ, ఆలయ కమిటీ సభ్యులు దూడ సింహాచలం రెడ్డి, పులి రామరెడ్డి, దర్మాల పైడిరెడ్డి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ ఔదార్యం

విశాలాంధ్ర - మాకవం పాలెం: మాకవరపాలెం మండ లం బూరుగుపాలెం గ్రామానికి చెందిన పోతల అప్పల నాయుడుకి అనారోగ్యం కారణంగా విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే గ్రామ వలంటీర్ త్రినాథ్ విశాఖ ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ను అందజేశారు. దీంతో వలంటీర్‌ను పలువురు అభినందించారు.

కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ట

విశాలాంధ్ర - యలమంచిలి: మండలంలో జంట గ్రామాలైన పి.ఎస్.ఆర్.పేట, బయ్యవర ప్రజలు తమ సొంత డబ్బులతో నిర్మించుకునేందుకు బుధవారం తలపెట్టిన శ్రీ శ్రీ శ్రీ దుర్గమ్మ వారి విగ్రహ ప్రతిష్టతో పాటుగా గురువారం శివ పార్వతుల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ దంపతులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. గురువారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో పిఎస్ఆర్ పేట, బయ్యవరం సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివలక్ష్మి, శివ దంపతులు, మొగలపల్లి వెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మొగ్గా గోవిందరావు, పండితులు సోమయాజి శర్మ మంత్రోచ్చారణల నడుమ హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఇదేం కర్మ

టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర - చింతపల్లి : వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని మండలంలోని చిన్న గెడ్డ గ్రామంలో గురువారం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ శ్రేణులు వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్యం చెందిందన్నారు. నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలు అందిస్తున్నామంటూ రాష్ట్ర అభివృద్ధిని

విస్మరించిందన్నారు. రాష్ట్రం పురోభివృద్ధి సాధించాలంటే మళ్లీ తెలుగుదేశం పార్టీని అధికారం లోకి తీసుకు రవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు .చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తద్వారా ప్రజలంతా సుభిక్షంగా, నిత్యవసర సరుకుల ధరలు అదుపులో ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దూరి రామకృష్ణ, షేక్ ఖాసిం వల్లి, అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ ఆధ్వర్యంలో

జరిగింది. అధికారులు తాము ఇంతవరకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు సమావేశంలో వినిపించారు. ముఖ్యంగా జగనన్న కాలనీలో త్రాగనీరుకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన గ్రామ సర్పంచ్‌లు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. అలాగే ఆసక్తిగల రైతులకు సరుగుడు, టేకు మొక్కలు ఉచితంగా జూలై నెలలో పంపిణీ చేయుటకు చర్యలు చేపడుతున్నట్లు అనకాపల్లి ఫారెస్ట్ అధికారి సమావేశంలో తెలిపారు. జగనన్న లే అవుట్‌లలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పేమెంట్లు పనిబట్టి ఇవ్వడం జరుగుతుందన్నారు. గడపగడవకు మన ప్రభుత్వ కార్యక్రమంలో 21 పనులకు గాను 82.82 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని ఇప్పటికే 5 పనులు పూర్తయ్యాయని ఆ డబ్బులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అల్లు శ్వేత తెలిపారు. అలాగే గ్రామాలలో త్రాగునీరుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పంచాయతీ నిధులతో గ్రామ సర్పంచులు మరమ్మతులు చేపట్టాలని ఆమె కోరారు. తహశీల్దార్ ఆర్.రమేష్ బాబు మాట్లాడుతూ ఇప్పటికే భూముల రీ సర్వే పక్రియ వేగవంతంగా సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సచి దేవి, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం హెచ్పి పెట్రోల్ బంక్ అనుకొన ఉన్న రహదారి లో గల సెయింట్ జోసెఫ్ స్కూల్ వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పద మృతి చెందాడు. స్థానికులు గమనించి మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న మల్కాపురం పోలీసులు వ్యక్తి ఎవరై దానిపై ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్య లేదా ప్రమాదం జరిగిందా అన్నదానిపైన దర్యాప్తు చస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేట్‌కి ధీటుగా ఏయూ పరుగులు...!

-కోర్సుల్లో సీట్లు పెంపుతో పెరిగిన అవకాశాలు
- క్యాంపస్ ఇంటర్వ్యూలకు పలు సంస్థలు ఆసక్తి

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం గత నాలుగేళ్లుగా జరిగిన సమగ్ర అభివృద్ధితో ప్రైవేట్ యూనివర్సిటీల కి ఏమాత్రం తీసుకోకుండా పోటీ పడుతోంది. విద్యారంగంలో ఇన్నాళ్లు ఏ ఏ అంశాలు అయితే ప్రైవేట్ యూనివర్సిటీలకి ఫ్లస్ పాయింట్ గా మారి, ప్రభుత్వ యూనివర్సిటీలను వెనక్కు నెట్టయో అవే అంశాలలో ఏయూ పగడ్బందీ ప్రణాళికలతో ముందుకు దూసుకెళ్లి ఐఐటీల స్థాయిన చేరేలా జాతీయ స్థాయిలో ప్రైవేటు విద్యాసంస్థలతో అన్ని విధాలుగా తన సత్తా చూపుతుంది.

యూనివర్సిటీకి ప్రధానంగా ఉన్న టీచింగ్ కొరతను, ప్లేస్మెంట్ సాధించడంలో లోపాన్ని వివిధ ప్రత్యామ్నాయ పద్ధతుల్లో అధికమించడంతో పాటు, నూతన కోర్సులు రూపకల్పన, ఇంజనీరింగ్ సహా ప్రాధాన్యత ఉన్న పలు కోర్సుల సీట్లు పెంపు వంటివి విద్యార్థులకు ఉపయుక్తంగా మారాయి. ఐఐటీల తరహాలో చైర్ ప్రొఫెసర్ల నియామకం జరగడం, వర్సిటీలో విద్యార్థులకు అన్ని వసతులు సమకూరడం, మౌలిక సదుపాయాలు కల్పన వంటివి వివిధ పరిశ్రమలు ప్రైవేట్ సంస్థలను ఆకర్షించాయి. దీంతో ఎంతో పేరున్న ప్రముఖ జాతీయ అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలు ఏయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఏయూవిసి ఆచార్య పీవీ జి డి ప్రసాద్ రెడ్డి చొరవతో సమర్థులైన ప్లేస్మెంట్ అధికారులు పరిశ్రమలను సంస్థలను వర్సిటీ విద్యార్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఏయూ కి ఆహ్వానించడం లో అన్ని విధాలా సఫలీకృతులయ్యారు. దీంతో ప్రైవేటు యూనివర్సిటీలు నివ్వెర పోయేలా ఏయూ పరుగు కొనసాగుతుంది. ఇప్పటివరకు ఒక రకమైన ధోరణిలో ముందుకు సాగిన ఏయు, ఉత్తరాంధ్ర విద్యాప్రదాయనిగా, పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల బావి బంగారు జీవితానికి సరికొత్త దారిలో నడుస్తూ ఆంధ్ర వర్సిటీ సరికొత్త నాంది పలికిందని చెప్పవచ్చు.

అమ్మ కాటికి.. నాన్న జైలుకి, మాకు దిక్కెవరు

నాన్నకున్న మద్యం అలవాటు, క్షణికావేశం
అమ్మ మరణానికి కారణం
అనాధలైన అభం శుభం ఎరుగని చిన్నారులు

భర్త చేతిలో నాటు తుపాకీతో హత్యకు గురైన విజయలక్ష్మి

భార్యను నాటుతోపాటుతో కాల్చి చంపిన రామచంద్రరావు

విశాలాంధ్ర - చింతపల్లి: క్షణికావేశంలో తండ్రి చేసిన తప్పిదం తమను అనాధలుగా చేసిందని గాలిమానువీధి గ్రామంలో ఈ మధ్య జరిగిన నాటు తుపాకీ తో భార్య ను కాల్చి చంపిన సంఘటనలో అనాధలుగా మిగిలిన చిన్నారులు మాకు దిక్కెవరు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే గత నెలలో జీ కే వీధి మండలం మొండి గెడ్డ పంచాయతీ కోటకొండ సమీప గాలి మానువీధి గ్రామంలో బార్యా భర్తలు గబులంగి విజయ, రామచంద్ర రావు లు చిన్నపాటి ఘర్షణ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన రామచంద్ర రావు మద్యం సేవించి విచక్షణ కోల్పోయి నిద్రిస్తున్న బార్య విజయ ను ఇంట్లో ఉన్న నాటు తుపాకీ తో కాల్చి చంపిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటనతో విజయలక్ష్మి మరణించగా, రామచంద్ర రావు జైలు పాలయ్యాడు.దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాధలుగా మిగిలారు. ఇలా ఎందుకు జరిగిందో తెలియక, అమ్మా, నాన్న లేని ఆ ఇంట్లో బిక్కు బిక్కు బిక్కుమంటూ, ఓదార్చే వారు లేక ఏమి చేయాలో పాలుపోక అయోమయ స్థితిలో తమకు దిక్కెవరు అని ఆ చిన్నారులు దీనంగా చూస్తున్న చూపులు ప్రతి ఒక్కరినీ ఆలోచింప చేస్తున్నాయి. మద్య సేవనం, క్షనికావేశం, విచక్షణ కోల్పోయి తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయి అనడానికి గాలిమానువీధి ఘటనే ఉదాహరణ

అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి అమర్

విశాలాంధ్ర - అనకాపల్లి: మండలంలోని కొత్తూరు, సత్యనారాయణపురం, పిసినికాడ గ్రామాల్లో 3 కోట్ల 41 లక్షలు అభివృద్ధి పనులు మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. పిసినికాడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. గ్రామానికి కోటి రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభించామని అన్నారు. గ్రామాల్లో సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రం, సీసీ రోడ్స్, సీసీ డ్రైన్స్ ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలు మేరకు చేపడుతున్నామన్నారు.

75 లక్షలతో ఇంటింటికి కొలాయికి పనులు ప్రారంభించిన తెలిపారు. గ్రామస్తులు స్థలాన్ని చూపిస్తే 50 లక్షల రూపాయలతో కళ్యాణ మండపాన్ని నిర్మించి ఇస్తామన్నారు.గ్రామంలో రెవెన్యూ సమస్యలపై వివరించగా మంత్రి అమర్నాథ్ రెండు పంచాయతీలుగా రెవిన్యూను వేరుచేసి త్వరలోనే రెండు ప్రాంతాల సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. ముందుగా సత్తమ్మ తల్లి అమ్మవారిని దర్శించేసుకొని పది లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని నిధులు మంజూరు చేసినట్లు హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ ఎల్లపు వెంకట రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గొర్లిసూరిబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బీసెట్టి వరాహ సత్యవతి,ఎంపీటీసీ మొల్లేటి హైమా శివాజీ, జోగా నాగమణి నాగేశ్వరరావు,వైఎస్ఆర్ పార్టీ నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మల్ల బుల్లి బాబు, ఇతర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

7న యలమంచిలి జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

హాజరుకానున్న
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఈ నెల 7 యలమంచిలి జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ భాస్కరరావు, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందర్ విజయకుమార్, చోడవరం నియోజవర్గం ఇంచార్జ్ కెవిఎస్ఎన్ రాజు తెలిపారు. ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు కి స్వాగతం పలికేందుకు అనకాపల్లి జిల్లా జనసైనికులు, వీర మహిళలు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే ర్యాలీ తో జన సైనికుల సమూహం, బలం ఏంటో అధికార పార్టీకి చూపిద్దాం అన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి పార్టీ కార్యాలయం నుంచి మునగపాక, అచ్యుతాపురం మీదుగా రాంబిల్లిలోని వెంకటాపురం జంక్షన్ వద్ద గల హరిపురం వరకు ర్యాలీ ఉంటుందని అన్నారు. అనకాపల్లి జిల్లాలోని ప్రతీ నియోజక వర్గానికి సొంత కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశంలో మాడుగుల నియోజకవర్గం నాయకులు రాయపురెడ్డి కృష్ణ, పెందుర్తి నాయకులు మొటూరి సన్యాసినాయుడు, కాపు సంఘం విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పైడి కొండ గీతా నాయుడు, జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

7న గోపాలపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - అనకాపల్లి: మండలంలో గోపాలపురం గ్రామంలో ఈ నెల 7న శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్నం) రాజా ఆప్టికల్ అండ్ కంటి ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకముల వ్యాధులకు పరీక్షలు చేస్తారని, కంటికి సంబంధించిన అన్ని రకముల మందులు పంపిణీ చేస్తామని అన్నారు. కంటి శుక్లాలు ఉన్నవారికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి లో ఉచితంగా శుక్లాల ఆపరేషన్ చేస్తారని ఆయన తెలిపారు.

సుమారు రూ. 40,000 ఖర్చు అయ్యే కంటి శుక్లాల ఆపరేషన్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తారని అన్నారు.

ఈ అవకాశాన్ని అవసరమైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్ ఆసుపత్రిని బ్రష్టు పట్టించిన మంత్రి, ఎంపీ

మాజీ ఎమ్మెల్యే పీలా

విశాలాంధ్ర - అనకాపల్లి: ఒక పక్క అంబులెన్సులు లేక ప్రజల ప్రాణాలు పోతుంటే 40లక్షల రూపాయల ఎంపీ ల్యాండ్స్ ప్రజాధనంతో కొన్న అంబులెన్సును మూలన పెట్టడం దారుణం అని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. కమిషన్ల కోసం మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లతో కుమ్మక్కైతే ఎంపీ భీసెట్టీ సత్యవతి ప్రైవేట్ అంబులెన్సులతో కుమ్మక్కైయ్యారు అని అన్నారు. ఎంపి సత్యవతి ఎంపీ ల్యాండ్స్ ను దుర్వినియోగం చేస్తున్నారు అని ఆరోపించారు. కమిషన్ల కోసమే వీరిద్దరూ %చీ=% జిల్లా ఆసుపత్రిని నిర్వీర్యం చేస్తున్నారాని అన్నారు. 4సంవత్సరాలు నుండి సిటీ స్కాన్ పనిచేయడం లేదని మంత్రి గుడివాడ అమర్నాథ్ కు ఇది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నెలకు లక్షల రూపాయలు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల నుండి మంత్రి గుడివాడ అమర్నాథ్ కు కమిషన్లు వెళ్ళడం వలనే ఎన్టీఆర్ ఆసుపత్రిని గాలికి వదిలేశారు అని ఆరోపించారు. అనకాపల్లి పట్టణంలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో మంత్రి గుడివాడ

అమర్నాథ్ కు, ఎంపీ సత్యవతి కి ఆయన సేల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ప్రైవేటు అంబులెన్సులతో కుమ్మక్కై ప్రజలను ఆసుపత్రి సూపర్డెంట్ దోచుకుంటున్నారు అని ఆరోపించారు. వెంటనే సిటీ స్కాన్ ను మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ కు చేతకాకపోతే సొంత డబ్బులతో సిటీ స్కాన్ ను మరమ్మత్తులు చేస్తాం అని అన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - అనకాపల్లి: స్వర్గీయ తాకాశి ఉమామహేశ్వరరావు (బాబు) రెండవ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు తాకాశి కన్నబాబు(చిన్ని) ఆధ్వర్యంలో తాకాశి వీది చిన నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పేదలకు 300 వందలమంది కి చీరలు, 500మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, యువజన అధ్యక్షుడు జాజుల రమేష్,యువజన నాయకుడు కోరుకొండ రాఘవ పాల్గొని పంపిణీ చేశారు. అలానే బొండా శంకరరావు ఆధ్వర్యంలో గాంధీనగర్ శ్రీ సత్యసాయి బాబా మందిరంలో తాకాశి బాబు జ్ఞాపకార్థం పేదలకు భోజనాలు, చీరలు, తువ్వాళ్ళు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలలో కారుకుండి కన్నబాబు, తాకాశి సత్యందొర,బేతి ఈశ్వరరావు, పలకా చంటి,ఉగ్గిన అప్పారావు, తాకాశి కిషోర్, తాకాశి విస్సు,సంభందం మోహన్, దోసపత్ని సోములు,యత్రా ఈశ్వరరావు, బుగతా అశోక్, మేడిశెట్టి గణేష్, తదితరులు పాల్గొనడం జరిగింది.